జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 19-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 343 పేజీలు: 4 వెల : రూ.7



# రంగు.. పడింది!



* మామిడిని కమ్మేస్తున్న కార్బైడ్ విషం
* రంగు చూసి కొంటే ఆరోగ్యానికి చేటు
* కాసుల కోసం అడ్డదారులు తొక్కుతున్న వ్యాపారులు
* చోద్యం చూస్తున్న ఆహార భద్రత నియంత్రణశాఖ అధికారులు

**శ్రీకాకుళం క్రైం, మే 18 (వార్త):** మామిడి పండును చూస్తుంటే నిగనిగ మెరిసిపోతోంది. ఎంత ఖరీదైనా కొని తీసుకెళుతున్నారు. తినేటప్పుడుగానీ దాని అసలు అసలు రంగు బయటపడటం లేదు. రసాలుగానీ, బంగినపల్లికానీ.. ఏ మాత్రం రుచీపచీ లేకుండా ఉంటున్నాయి. సహజసిద్ధమైన రుచిని పూర్తిగా కోల్పోతున్నాయి. కారణం రసాయనాలతో ముగ్గబెట్టడమే. జిల్లావ్యాప్తంగా కార్బైడ్‌తో ముగ్గబెట్టిన పళ్లనే కొందరు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ పండ్లను తిన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గతంలో చెట్ల నుంచి కాయలు కోశాక.. ఐదారు రోజులపాటు ఒక గదిలో ఎండుగడ్డి మధ్య ఉంచి, సాంబ్రాణి పొగ పెట్టి గది నుంచి గాలి బయటకు రాకుండా పేడతో అల్లుతారు. ఈ విధానంలో కాయలన్నీ పండుగా మారేందుకు దాదాపు వారం రోజుల సమయం పడుతుంది. ఆ పండు తింటే రుచి అదుర్స్. ప్రస్తుతం ఈ ప్రక్రియ చేయలేక వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. పక్వానికి రాని కాయలను సైతం కోసేసి కార్బైడ్‌తో ముగ్గబెడుతున్నారు. దీన్ని వాడితే ఒకట్రెండు రోజుల్లోనే కాయలకు రంగు వస్తుంది. పైకి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. లోపల గుజ్జు దెబ్బతింటుంది. ఇవి తింటే వాంతులు, విరేచనాలు, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎర్రరక్త కణాలు విచ్ఛిన్నమై రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందన్నారు. మన దేశంలో కాల్షియం కార్బైడ్ వాడకాన్ని నిషేధించాయి. ఆహార కల్తీ నిరోధక చట్టంలోని సెక్షన్ 44ఏ ప్రకారం కార్బైడ్‌తో కృత్రిమంగా పండ్లను ముగ్గబెట్టి అమ్మడం నేరం. అయినప్పటికీ జిల్లాలో పలువురు పండ్ల వ్యాపారులు గదులను అద్దెకు తీసుకుని మామిడిని కార్బైడ్‌తో ముగ్గబెడుతున్నారు. వాటిని గుర్తించి భూస్థాపితం చేసే అధికారం ఆహార భద్రత నియంత్రణశాఖ అధికారులకు ఉన్నప్పటికీ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. మామిడికాయలను ఇతర ప్రాంతాలను తెప్పించుకుని గొడౌన్లలో నిల్వ ఉంచి రసాయనాలు పూసి పసుపు రంగు వచ్చిన వెంటనే వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు నరసన్నపేట, పలాస, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, రణస్థలం, ఇతర ప్రాంతాల్లో రసాయనాలు కలిపిన మామిడి పండ్లనే విక్రయిస్తున్నారని కొందరు చెబుతున్నారు. ఇకనై ఆహార తనిఖీ అధికారులు స్పందించి వీటిపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లావాసులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఏం చేస్తారో చూడాలిమరి.



# కార్యకర్తలే.. మా బలం

* వారి సంక్షేమానికి పాటుపడతా
* టెక్కలి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా
* వైసీపీ ప్రభుత్వంలో కార్యకర్తలకు ఇబ్బందులకు గురిచేశారు
* అక్రమాలకు పాల్పడిన వైసీపీ శ్రేణులను విడిచిపెట్టేది లేదు
* ఆ పార్టీ నేతలు ఇప్పుడు ఎక్కడున్నారో కనిపించడం లేదు
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* కోటబొమ్మాళిలో మినీమహానాడు

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, మే 18 (వార్త):** తెలుగుదేశం పార్టీకి బలం కార్యకర్తలేనని, వారికి పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా అధిష్టానం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో మినీమహానాడు సభ నిర్వహించారు. పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు హాజరయ్యారు. పార్టీ జెండాను అచ్చెన్న ఎగురవేశారు. ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 ఏళ్లు కాగా, 23ఏళ్లు పార్టీ అధికారంలో ఉందంటే.. కార్యకర్తలే కారణమన్నారు. కోటి 3లక్షల సభ్యత్వాలతో పటిష్టంగా తెలుగుదేశం పార్టీ ఉందని చెప్పారు. గ్రామ, మండలస్థాయి కమిటీలతో బలంగా ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అభివృద్ధితోనే గెలిచి తీరుతామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు మనం కూడా చేయకూడదన్నారు. సంపద సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు మధ్య విభేదాలు లేకుండా కలిసి పనిచేసే దిశగా పార్టీని సమర్ధవంతంగా ముందుకు నడిపిద్దామన్నారు. అప్పులో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారని తెలిపారు. ఈ నెల 27 నుంచి కడపలో జరిగే టీడీపీ మహానాడు విజయవంతం చేయడానికి కార్యకర్తలు తరలిరావాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. టెక్కలి నియోజకవర్గాన్ని 2029 నాటికి అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా తారురోడ్లు, సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, టెక్కలి, నరసన్నపేట ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు రూ. 1,200కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. సంతబొమ్మాళి మండలంలో పదివేల ఎకరాల్లో పారిశ్రామిక రంగం విస్తరించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించి ఆదాయ వనరులు పెంచుకోవాలి. రైతులకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరిస్తాం. ఉత్తరాంధ్ర సుజలస్రవంతి ద్వారా వంశధారకు నీరందిస్తామ'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. వైసీపీ అరాచక పాలనలో అక్రమ కేసులతో నాతో సహా కార్యకర్తలందరూ నిద్రలేని రాత్రులు గడిపామన్నారు. గత ఐదేళ్లు ఇష్టారాజ్యంగా నోరుపారేసుకొని చెలరేగిన వైసీపీ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారో కనబడడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దోపిడీ చేసిన ఏ ఒక్కర్ని విడిచిపెట్టేది లేదన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ఎల్ నాయుడు, బోయిన గోవిందరాజులు, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండల పార్టీల అధ్యక్షులు బోయిన రమేష్, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, హనుమంతు రామకృష్ణ ఉన్నారు.



## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

**మందస, మే 18(వార్త):** ప్రతీ ఒక్కరూ విధిగా పుస్తక పుస్తక పఠనం చేయాలని, దీంతోనే విజ్ఞానం పేరుగుతుందని మందస శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ విజయలక్ష్మి మొబైల్స్, టీవీ విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. పుస్తక పఠనం కోసం గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ సింధూర్‌తో..
# పాకిస్తాన్‌కు గుణపాఠం

*** కూటమి నాయకులు**

*** వీర జవాన్లకు సంఘీభావంగా విజయోత్సవ ర్యాలీ**

**పలాస, మే 18, (వార్త):** పహల్గాం ఉగ్రదాడిలో అమాయక ప్రజలకు ప్రాణాలు తీసిన పాకిస్తాన్ టెర్రరిస్టులను వారి స్థావరాలను గుర్తించి సింధూర్ ఆపరేషన్ పేరుతో భారత జవాన్లు దాడి చేసి పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పలాస- కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ తిరంగి ర్యాలీ నిర్వహించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ శ్రీనివాస్ లాడ్జి మీదుగా కాశీబుగ్గ బస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలతో ఆపరేషన్ సింధూర్ అనే నినాదంతో ఉగ్రవాదులను మన వీర జవాన్లు హతమార్చి ప్రపంచంలో భారతదేశం సత్తా అంటే ఏమిటో రుచిచూపించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్



దుర్గారావు, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, జనసేన నాయకులు ధర్మారావు, పలాస బిజెపి కన్వీనర్ రామానంద్ స్వామి, న్యాయవాదులు గని, అనిల్ రాజు, ఎక్స్ సర్వీస్ మెన్లు, కూటమి నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## పాలవలసలో యువకుడి హత్య

**సోంపేట, మే 18 (వార్త):** సోంపేట మండలంలోని పాలవలసలో ఓ యువకుడిని హత్య చేశారు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలవలసకి చెందిన గోకర్ల ఈశ్వరరావు(38) శనివారం రాత్రి ఇంటి నుంచి బయలు దేరి గ్రామంలో జరుగుతున్న సంబరానికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటినా తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబీకులు అతని కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం ఉదయం గ్రామా నికి సమీపంలోని తోటల్లో విగత జీవిగా పడిఉండాన్ని గుర్తించారు. ఈశ్వరరావు పీక, మెడ, ఎడమ చెవి, తలపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే సోంపేట పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు ఆధ్వర్యంలో సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## సర్వే నమోదుకు సహకరించండి



**మెళియాపుట్టి, మే 18 (వార్త):** ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా గ్రామాలలో ఉన్న 18 సంవత్సరాలు వయసు గల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సహిత ఉపాధ్యాయుల ద్వారా గ్రామాలలో సర్వే నమోదు, గుర్తింపు జరుగుతుందని వారికి సహకరించాలని విద్యాశాఖధికారులు ఎస్. దేవేందర్ రావు, ఎం. పద్మనాభరావులు కోరుతున్నారు. ఈ సర్వే నమోదు కార్యక్రమం మే 13 తేది నుండి జూన్ 9 వరకు జరుగుతుందని, సహిత ఉపాధ్యాయులైన ఎన్. ఝాన్సీరాణి, పి. శివప్రసాద్ లు ఈ సర్వే కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండలంలో చేపడుతున్నట్లు తెలిపారు. వినికిడి, దృష్టిలోపం, శారీరక వైకల్యం, మేధో వైకల్యం, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వంటి 21 రకాల వైకల్యాలకు చెందిన పిల్లలు గ్రామాలలో ఎక్కడైనా ఉంటే తగిన సమాచారం అందించాలని కోరారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, అంగన్వాడి వర్కర్స్, ఆశా కార్యకర్తలు తదితర ప్రతి ఒక్కరూ సహిత ఉపాధ్యాయులకు ప్రత్యేక అవసరాల గల పిల్లల వివరాలు అందజేసి సహకరించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను నమోదు చేయడం వలన భవిష్యత్తు కాలంలో ప్రభుత్వం ద్వారా అందించే వివిధ రకాల అలవెన్సులు, దృష్టి మరియు శ్రవణ పరికరాలు, వీల్ చైర్స్ తదితర పరికరాలు పిల్లలకు అందించి వారి జీవితాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తోడ్పడుతుందన్నారు. మెళియాపుట్టి మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమాచారం తెలిసినవారు కింది మొబైల్ నెంబర్లకు 9505177944, 8074632293 వివరాలు తెలియజేయాలని సూచించారు.

## ప్రశాంతంగా ఎర్రన్న విద్యాసంకల్పం మాక్ పరీక్ష

**శ్రీకాకుళం, మే 18(వార్త):** కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల, చైతన్య జూనియర్ సహకార కళాశాలలో ఎర్రన్న విద్యాసంకల్పం కార్యక్రమంలో భాగంగా డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత మోక్ టెస్ట్, కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్ష నిర్వహించారు. 200కు మంది పైగా అభ్యర్థులు ఈ పరీక్ష రాశారు. శాసనసభ్యులు గొండు శంకర్ హాజరయ్యి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షకు సహకరించిన కాలేజీ యాజమాన్యానికి కేంద్ర మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.




# వైసీపీ ప్రభుత్వం హయాంలోనే డయాలసిస్ కేంద్రం పనులు

### సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి

**ఇచ్ఛాపురం, మే 18 (వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు గత ప్రభుత్వంలోనే అనుమతులు పొందినప్పటికీ నేటి వరకు కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకుని రావటానికి తాత్సరం చేసిన యంత్రాంగం ఎట్టకేలకు పనులు పూర్తి చేసి 5 డయాలసిస్ యంత్రాలతో సేవలు ప్రారంభించేందుకు ఏర్పాటు చేయడం సంతోషం అని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. డయాలసిస్ కు 24 గంటల పవర్ సప్లై అవసరం ఉందని, అయితే ఎమర్జెన్సీ పవర్ సప్లై ఏర్పాటు చేయలేదన్నారు. పవర్ సప్లైలో ఇబ్బందులు తలెత్తితే డయాలసిస్ మధ్యలో రోగులకు ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. కవిటి, సోంపేట నందు నెఫ్రోప్లస్ సిబ్బంది సేవలు అందిస్తున్నారని, ఇచ్ఛాపురంలో ఢిల్లీకు చెందిన కొత్త సంస్థ ద్వారా సిబ్బంది సేవలు ఇబ్బబోతున్నారన్నారు. సిబ్బంది కొత్త వారు, సరిపడా సిబ్బంది ఏర్పాటు జరగలేదన్నారు. డయాలసిస్ మెషిన్స్ గత ప్రభుత్వంలోనే మంజూరు జరిగాయని తెలిపారు. డయాలసిస్ కేంద్రంకు ఉపయోగించబోయే బిల్డింగ్ 2008-11మధ్యలో అప్పటి మంత్రి ధర్మాన ప్రసాద రావు చేతుల మీదుగా ప్రారంభించిన ప్రసూతి కేంద్ర బిల్డింగ్ వినియోగం లోకి తెచ్చారన్నారు. తనతో




పాటు కౌన్సెలర్ ప్రతినిధి పిలక విజయ్ డయాలసిస్ కేంద్రం పనులు, వసతులు పరిశీలించడం జరిగిందని అన్నారు. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోగల కిడ్నీ రోగులకు ఈ డయాలసిస్ కేంద్రం ఉపయోగపడుతుందని, అయితే తగినంత మంది సిబ్బంది, ఎలక్ట్రికల్ పవర్ సప్లై ఏర్పాటులో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుని సేవలు కొనసాగాలని కోరారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్థురాలు సుజాతకు సాయం

***రూ.1,01,300లు అందజేత**

***దాతలు ఆదుకోవాలని బాధితులు వేడుకోలు**

**మందస, మే 18(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామానికి చెందిన సుజాతను సోంపేట మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన బైపల్లి రవికి ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం సుజాత కిడ్నీ సమస్యలతో బాధపడుతోంది. బైపల్లి సుజాత ఆపరేషన్ అనంతరం త్వరగా కోలుకోవాలని గెడ్డవూరు గ్రామస్తులు ఆకాంక్షించారు. వైజాగ్ ప్రైవేట్ ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న సుజాతను కలిసిన వారు వైద్య ఖర్చులు కోసం గ్రామస్తులు నుంచి సేకరించిన రూ.1,01,300లు ఆమె భర్త బైపల్లి రవికి అందజేసి మానవత్వాన్ని చాటారు. ఈ సంధర్భంగా గ్రామస్తులు పిచ్చుక కిరణ్, వంక శ్యాంసుందరరావు తదితరులు విశాఖపట్నం హాస్పిటల్ కు వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, పరామర్శించారు. ఎర్రముక్కాం గ్రామానికి కోడలుగా వెళ్లిన సుజాత గెడ్డవూరు ఆడపడుచు కావడంతో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసారని ,వారందరికీ ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇప్పటిదాకా సుమారు ఆరు లక్షల ఖర్చు అయిందని పూర్తి స్థాయిలో వ్యాధి నయం అయ్యేందుకు మరో ఐదు లక్షల వరకు అవసరం ఉందని వైద్యులు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు దాతల సాయాన్ని కోరారు. సాయం అందించాలనుకునే దాతలు 6303094008 అనే ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని బాధితరాలి భర్త రవి కోరారు.





## వైభవంగా మరిడమ్మ తల్లి ఉత్సవం

**ఎచ్చెర్ల, మే 18 (వార్త):** ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు విభాగం మైదానం ఆవరణలో కొలువున్న మరిడమ్మ తల్లి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా వైశాఖమాసంలో పోలీసు అధికారులు,సిబ్బంది ఎంతో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న మరిడమ్మ అమ్మవారి ఉత్సవాల్లో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదివారం పాల్గొని పూజలు చేశారు. తొలుత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది అందరూ సమైక్య భావంతో ఇటువంటి ఉత్సవాలు, పండుగలు నిర్వహించడం శుభసూచకమన్నారు. జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు ఆ అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరికి మంచి జరగాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కే. నర్సింగరావు పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముక్తేశ్వర ఆలయానికి దాతల వితరణ



**మందస, మే 18(వార్త):** మందస మండలంలోని మూలిపాడులో నిర్మించిన శ్రీముక్తేశ్వర ఆలయ సముదాయానికి ఆధ్యాత్మిక వేత్త పుప్పాల రాజారావు, పుప్పాల మోహనరావులు వితరణ చూపారు. ఆలయంలో వంటలు, ప్రసాదం, అన్నదానం చేసేందుకు వంట పాత్రలను మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. రాజారావు, సావిత్రి దంపతులు, మోహనరావు, ఊర్వశి దంపతులు కుటుంబాలపై శ్రీముక్తేశ్వరస్వామి కరుణ, కృప, కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని సర్పంచ్ వెంకటరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వినోద్ కుమార్ పాణిగ్రాహి కూడా ఉన్నారు.

## పిడుగులతో అప్రమత్తం

*** 19, 20 తేదీల్లో పిడుగులు పడే అవకాశం**
*** జిల్లాలో 40-50 కిమీ వేగంతో గాలులు, ఉరుములతో వర్షాలు * ప్రజలు జాగ్రత్తలు పాటించాలి**
*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, మే 18 (వార్త):** జిల్లాలో ఈ నెల 19 నుంచి 23వ తేదీల్లో అక్కడక్కడ 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఉరుములు, మెరుపులు వచ్చే అవకాశం ఉంది.. 21,22,23 తేదీల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా కురిసే సూచనలు ఉన్నాయి.. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉంది.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.. అని జిల్లా కలెక్టర్ డా. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు ప్రాణనష్టం లేకుండా ఉండేందుకు, ప్రభుత్వ శాఖలు ముందస్తుగా చర్యలు చేపట్టాయని తెలిపారు. విపత్తు నిర్వహణ శాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలపై సూచనలు జారీ చేశారు. వానల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదన్నారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర నిలవకూడదని, మొబైల్ ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకూడదని సూచించారు. ఇంట్లో ఉన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా చూడాలని, పశువులను కప్పుతో కూడిన షెడ్లులో ఉంచాలని, టీవీ, ఫ్రిజ్, మోటార్లు వంటి విద్యుత్ పరికరాల ను స్విచ్ ఆఫ్ చేయాలని, నీటి మోటర్లు నడపరాదని చెప్పారు. గాలివానల వేళ పంట పొలాల్లోకి వెళ్లకూడదని, బైకులు, ఆటోలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను వాడకూడదన్నారు. పుకార్లను నమ్మకూడదని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని కోరారు. విపత్తుల సమయంలో జిల్లా విపత్తు నిర్వహణ కేంద్రం 24 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. ప్రాణాలే ముఖ్యమైనవని గుర్తుంచుకుని, ప్రజలంతా సూచనలు పాటించి భద్రతగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 18వ వార్డును ఆదర్శవార్డుగా తీర్చిదిద్దుతా



**పలాస, మే 18(వార్త):** ఆదర్శవార్డుగా 18వ వార్డును తీర్చిదిద్దుతామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మారుతి నగర్ లో కాలువలు చెత్త చదరంతో నిండిపోవడంతో మురుగు నీరు నిండిపోవడంతో ఆటంకం ఏర్పడి ఈ విషయాన్ని వార్డ్ కౌన్సిలర్ సనపల సింహాచలం, వార్డు ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ చైర్మన్ వెంటనే స్పందించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వాటి ప్రజలు వార్డు ప్రజలు అందిస్తున్న సహకారంతో వార్డు ప్రజలకు సహకారం ఏం చేయాలని ఆలోచనతో ఉన్నానని చెప్పారు. 18 వ వార్డులో ఎస్ఎఫ్ఎస్ స్కూలు దగ్గర 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డును వేయడం జరుగుచున్నది దానిని కూడా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వడిసి భాస్కరరావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## నేడు బాలిగాం రైల్వేగేటు మరమ్మతు పనులు

**మందస, మే 18(వార్త):**మందస మండలంలోని బాలిగాం గ్రామం వద్ద గల రైల్వే గేటు మరమ్మతు పనులు జరుగుతాయని తెలుగు దేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన చెప్పారు. సోమవారం ఉదయం 4గంటల నుండి ఉదయం 8వరకు బాలిగాం రైల్వే గేటు దగ్గర ట్రాక్ మెయింటినెన్స్ పనులు జరుగుతున్న సందర్భంగా గేటును సుమారు 4 లేదా 5గంటలపాటు మూసి వేయబడుతుందని రైల్వే అధికారులు తెలిపారన్నారు. స్థానికులు, గ్రామ ప్రజలు, ప్రయాణీకులు గమనించాలని ఆయన కోరారు.

## అనుమతుల్లేకుండా క్వారీలు నిర్వహించొద్దు

*** టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి**
*** మైన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం**

**టెక్కలి, మే 18(వార్త):** గ్రానైట్, రోడ్డు మెటల్ క్వారీల నిర్వహణకు అన్ని రకాల అనుమతులు తప్పనిసరని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గనులు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెళియాపుట్టి మండలంలో క్వారీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పేలుళ్లు జరిగిన క్వారీకి పలు రకాల అనుమతులు లేనట్లు గుర్తించామన్నారు. గ్రానైట్ క్వారీ నిర్వహణకు రెవెన్యూ, పంచాయతీ, పర్యావరణ, బ్లాస్టింగ్ అనుమతులు ఉండాలన్నారు. ఆయా గ్రానైట్ క్వారీలు అన్ని అనుమతులు చూపే వరకు ఎటువంటి పనులు చేయవద్దని, నిలుపుదల చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, మైన్స్, పంచాయతీ అధికారులు నేరుగా క్వారీలకు వచ్చి ఆయా రకాల అనుమతులు పరిశీలించిన తరువాత అన్నీ సక్రమంగా ఉంటేనే క్వారీల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, సీఐలు విజయ్ కుమార్, రామారావు, గ్రానైట్ క్వారీల యజ మానులు దొడ్ల మహేష్, హరికుమార్, అల్లు నగేష్, పాండ్యన్, తహశీల్దార్లు రవికుమార్, అప్పలరాజు, మైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏపీఓ స్వగ్రామంలో..
## చెరువును కప్పేస్తున్నారు



**సంతబొమ్మాళి, మే 18 (వార్త):** కంచె చేను మేస్తే కాసేవారు ఎవరన్నా సామెతల తయారయింది సంతబొమ్మాళి మండల ఉపాధి ఏపీవో పంగ నరసింహామూర్తి పరిస్థితి. ఇటీవల జిల్లా కలెక్టర్ చివాట్లు పెట్టిన ఏపీవో తీరులో మార్పు లేదని అనిపిస్తుంది. ఏపీవో స్వగ్రామైన చెట్లతాండ్ర గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న పెద్ద చెరువును కప్పేస్తున్నరు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి చెరువును ఆదివారం కప్పేయడం ప్రారంభమైంది. దీనిపై కొందరు ప్రశ్నించిన గ్రామ అవసరాల కోసం చెరువును కొంతమేరకు కప్పేస్తున్నామని చెప్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండడం వలన రైతులకు ఎంతగానో ఉపయోగపడేదని ఇప్పుడు కప్పేయడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు రైతులంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి చెరువులో పనులు జరుగుతున్న ఏపీవో నరసింహామూర్తి పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలలో గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. ఏపీవో ఆధ్వర్యంలోనే చెరువులను కప్పేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# హెచ్ఐవీ ఎయిడ్స్‌ను తరిమికొట్టాలి

*** జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ శ్రీకాంత్ * నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన**



**శ్రీకాకుళం, మే 18 (వార్త):** హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను తరిమికొట్టాలని, బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ టి. శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినం పురస్క రించుకుని ఎయిడ్స్/హెచ్ఐవీ బాధితులకు సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో బీసీహెచ్ అప్పలనాయుడు, ఏఆర్టీ సిబ్బంది, ఐసీటీసీ, డీఎస్ఈఆర్సీ, పీపీటీసీటీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మోహిని, ఆదిలింగం, మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.



### ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

**ఇచ్ఛాపురం, మే18(వార్త):** ఎయిడ్స్ వ్యాధిని సమూ లంగా నిర్ములిద్దామని ఐసిటిసి కౌన్సిలర్ రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుండి బస్ స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గెస్ట్, ఎన్ జి ఓ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో నడుచుకోండి

*** నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి * రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్**

**శ్రీకాకుళం క్రైం, మే 18 (వార్త):** నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లాలో గల రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాలతో ఆదివారం పలు పోలీసు స్టేషను పరిధిలో రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లా పట్టణ కేంద్రంగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ తో పాటు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, చెడు నడతగలవారిని పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించి నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.



### శ్రీకాకుళం నుంచి సాలూరుకు ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం, మే 18(వార్త):**సాలూరులో ఈ నెల 18 నుంచి 21 వరకు జరిగే శ్యామలాంబ అమ్మవారి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పాలకొండ, పలాస, టెక్కలి, శ్రీకాకుళం 1, 2 డిపోల నుండి 356 బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో శ్రీకాకుళం నుండి రాజాం వరకూ 80 బస్సులు, రాజాం నుండి సాలూరు వరకూ 180 బస్సులు, బొబ్బిలి నుండి సాలూరు వరకూ 96 బస్సులు ఉన్నాయన్నారు. సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుండి బయలుదేరే దూరప్రాంత సర్వీసులు మినహా, మిగిలిన అన్ని మార్గాలలో తిరిగే బస్సులను క్రమబద్ధీకరించి మళ్లించడం వలన, ప్రయాణీకులకు కొంతమేరకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక బస్సుల సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం క్రైం, మే 18 (వార్త)::** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546